క్లుప్తంగా

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

ఆదోని రూరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆదోని డివిజన్ సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. అమ్మవారి అనుగ్రహంతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో జీవించాలని కోరుకుంటున్నానని అందులో పేర్కొన్నారు.

రూరల్ సీఐగా ఎన్. చిరంజీవి



ఎమ్మిగనూరురూరల్: రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.చిరంజీవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రూరల్ సీఐ మధుసూదన్‌రావుకు డీఎస్పీగా పదోన్నతిపై వెళ్లడంతో ఫ్యాక్షన్ జోన్ సీఐగా పనిచేస్తున్న ఎన్. చిరంజీవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సీఐకు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అలాగే మండల అధ్యక్షులు గొల్ల కేశన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జాలవాడి లక్ష్మన్నలు ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలియజేశారు.

వృద్ధులకు సన్మానం



వృద్ధులను సన్మానిస్తున్న ఆశ్రమ డైరెక్టర్ విక్టర్ పాల్ ఫిలిప్

ఆదోని అర్బన్: పట్టణంలోని జీవనజ్యోతి వృద్ధుల ఆశ్రమంలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ డైరెక్టర్ విక్టర్ పాల్ ఫిలిప్ ఆధ్వర్యంలో వృద్ధులకు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులైన వారిని గౌరవించడం, వారిని బాధ్యతగా చూసుకోవడం ముఖ్యమన్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కుమారులు, కుమార్తెలు బాధ్యతగా చూసుకుంటే కుటుంబాలు బాగు పడతాయన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకరమైన జీవితం

ఎమ్మిగనూరురూరల్: పోషక విలువలు ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ్ మహ్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు, మహిళలు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు గుడ్లు, మాంసం, పాలు, పెరుగు, ఆకు కూరలను రోజూ తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ఆదోని రూరల్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని సర్పంచ్ అల్లమ్మగారి సరళమ్మ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లమ్మ గారి పురుషోత్తంరెడ్డి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లోని మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ వేయించారు.

అత్యవసర వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అత్యవసర వైద్య సేవలందించడంలో వైద్యులు నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌డీసీ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో వయస్సుకు తేడా లేకుండా హార్ట్ స్ట్రోక్, గుండెకు సంబంధించిన సమస్యలు ఎక్కువ వస్తున్నాయని చెప్పారు. గుండె పోటు సమస్యతో ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన వారికి ఈసీజీ చూసి, అత్యవసర వైద్య చికిత్స కోసం గుండె పోటు వచ్చినప్పుడు రూ. 40 వేల విలువ చేసే ఇంజక్షన్ 40 ఎంజీని ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. హైస్థాయి వైద్యులతో మాట్లాడి ప్రస్తుతానికి 6 ఇంజక్షన్లు తెప్పించినట్లు, ఇప్పటికే వైద్యులు ఇద్దరికి రెండు ఇంజక్షనులు వాడటం వలన వారి ప్రాణాలను కాపాడరన్నారు. పాత హాస్పిటల్ నుంచి మొత్తం కొత్త హాస్పిటల్‌కు మార్చినట్లు చెప్పారు. సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర సుధ, డాక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల ఆరాధ్య దైవం

- కొలిచేవారికి కొంగు బంగారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి
- నేటి అర్ధరాత్రి నుంచి విగ్రహమహోత్సవం ప్రారంభం
- పాల్గొననున్న నాలుగు గ్రామాల ప్రజలు





పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి, స్వామివారి ఉత్సవానికి సిద్ధం చేస్తున్న పల్లకీ

ఎమ్మిగనూరురూరల్: కొలిచేవారికి కొంగు బంగారం ..నాలుగు గ్రామాల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్నాడు శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి. మండల పరిధిలోని కందనాతి గ్రామంలో కొండపై వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి గ్రామీణుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటు ప్రజల ఇలవేల్పుగా ఆరాధించబడుతున్నాడు. విజయ దశమినాడు స్వామివారి విగ్రహమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. పండుగరోజు దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురువారం అర్ధరాత్రి 2 గంటల నుంచి స్వామివారి విగ్రహమహోత్సవం ప్రారంభమై 3వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు కొనసాగుతుంది.

జమ్మిచెట్టు వద్ద పూజలు..

స్వామివారి పల్లకీని నాలుగు వైపులా నాలుగు గ్రామాల ప్రజలు భక్తిశద్ధలతో మోస్తారు. కందనాతి, మసీదపురం, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి గ్రామాల ప్రజలు ఇందులో పాల్గొంటారు. విగ్రహమహోత్సవాన్ని కడివెళ్లకు వెళ్లేదారిలో గ్రామ పొలిమేరలో ఉన్న జమ్మిచెట్టు వరకు తీసుకెళ్లి అక్కడ పూజలు చేసి మరలా కొండ పైకి చేరుస్తారు. విగ్రహమహోత్సవం ప్రశాంతంగా దేవాలయానికి చేరుకుంటే గ్రామాల్లో పాడిపంటలతో సంతోషంగా ఉంటారని ప్రజల నమ్మకం. విగ్రహమహోత్సవంలో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో నిష్టతో ఉన్నవారు మాత్రమే పాల్గొంటారు. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామికి పూజలు జరిగినట్లే శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి శరన్నవరాత్రుల చివరి రోజు వరకు పూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఈ గ్రామంలో జరిగే విగ్రహ మహోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు.

విగ్రహమహోత్సవాన్ని మోసే భక్తులకు నిబంధనలు

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహ మహోత్సవాన్ని మోసే కందనాతి, వెంకటగిరి, మసీదపురం, మాచుమాన్‌దొడ్డి గ్రామాల ప్రజలు భక్తిశద్ధలతో, నిష్టతో ఉంటారు. పల్లకీని మోసే వారు భార్యలతో ఎక్కువగా మాట్లాడరాదు, మంచంపై కూర్చోరాదు, పొరకను తాకరాదు, ఎవరిని తిట్టురాదు, ఆడవాళ్లను ఆట పట్టించరాదు, ఈ నియమాలు మహోత్సవానికి మూడు రోజుల ముందు నుంచి పాటిస్తారు. నిష్ట తప్పిన వారికి స్వామి వారు ఏదో ఒక రూపంలో శిక్ష వేస్తారనేది ఇక్కడివారి నమ్మకం.

మహిమగల దేవుడు

కందనాతి, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి, మసీదపురం గ్రామ ప్రజల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి మహిమగల దేవుడని కందనాతికి చెందిన పూజారి ఎంకయ్య తెలిపారు. మహోత్సవంలో పాల్గొనే నాలుగు గ్రామల ప్రజలు భక్తితో పాల్గొంటారన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు వేలాది మంది తరలివస్తారని చెప్పారు.

వృద్ధుల సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: వృద్ధులకు ఆధార్‌కార్డు, పింఛన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, వృద్ధుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వృద్ధులను పరామర్శించి, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న వారిలో కొందరు వృద్ధులు తమకు పింఛన్లు రావడంలేదని, ఆధార్‌కార్డులు లేవని జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను పరిష్కరించడానికి చట్టం ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మహిషాసురమర్దిని పాహిమాం



మహిషాసురమర్దినిగా ఫారెస్ట్‌లైన్ శ్రీ అంబాభవాని



రుద్రాక్షల అలంకారంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.



మున్సిపల్ క్రీడా మైదానంలో దుర్గా పరమేశ్వరిదేవిగా



రాజరాజేశ్వరిగా వాసవీ కన్యకా పరమేశ్వరిమాత



మహిషాసురమర్దినిగా ఎం ఎం కాలనీ పరమేశ్వరి దేవి



ద్రాక్ష అలంకారంలో పేట వీరభద్రేశ్వరస్వామి



మహిషాసుర మర్దినీ దేవిగా శాంభవి దేవి



దుర్గాదేవిగా చౌడేశ్వరి అమ్మవారు



మహిషాసుర మర్దినిగా బంగారమ్మ దేవి



దుర్గాదేవిగా మంచాలమ్మ



కౌతాళంలో వేంకటేశ్వరస్వామి పల్లకోత్సవం

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు

నందవరం : మండల కేంద్రం నందవరం పోలీస్ స్టేషన్‌లో దేవి శరన్నవరాత్రులో భాగంగా బుధవారం ఆయుధ పూజ గావించారు. పురోహితులు హంపేష్‌స్వామి నేతృత్వంలో పోలీసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పోలీసు వాహనాలకు, తుపాకులకు పూజ చేశారు.

నేడు చికెన్, మటన్ దుకాణాలు బంద్

ఆదోని టౌన్: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా 2వ తేదీ (గురువారం) పట్టణంలో మటన్, చికెన్, అన్ని రకాల నాన్ వెజిటేరియన్ వ్యాపారాలు బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మటన్, చికెన్‌కు సంబంధించి చిన్న మరియు పెద్ద కబేళాలలో వధించడం కూడా నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గోనెగండ్ల: వస్తు సేవా పన్నుల తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, జీఎస్టీ అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ ఆధ్వర్యంలో వస్తు సేవా పన్నుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం అమలు చేస్తున్న జీఎస్టీ వల్ల రైతులకు వచ్చే పరికరాలు, ట్రాక్టర్స్, ట్రాక్టర్ల సామాన్లు, డ్రిప్, స్ప్రింక్లర్స్ మీద ఐదు శాతం మాత్రమే ట్యాక్స్ వసూలు చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల ప్రతి రైతుకు చాలా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాగే రైతులు వాడే సూక్ష్మ పోషకాలు కూడా ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి రావడం వల్ల రైతులకు ఎంతో మేలు అన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనంతసేనా, ఏఓ హేమలత, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, రాజేష్, గురునాథ్ రెడ్డి, పులిరాజు, రాంగోపాల్ తపాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

పెద్దకడబూరు : వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో వాటి రేట్లు తగ్గినట్లు ఏడీఏ(ఆదోని) బాలవర్ధిరాజు, మండల వ్యవసాయాధికారిణి సుచరిత తెలిపారు. మండల పరిధిలోని జాలవాడి, హెచ్.మురవణి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నీట మునిగిన పత్తి పంటను పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు అందించారు. పొలాలలో నీరు అధికంగా నిలవకుండా బయటకు పోయే విధంగా చూసుకోవాలన్నారు. అధికంగా నత్రజని ఎరువులను వాడరాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్లు, వాటి పరికరాలపై 7శాతం జీఎస్టీ తగ్గించిందన్నారు. ఎంఐఓ నాగరాజు, రైతుసేవాకేంద్రం సిబ్బందిలోకపావని,కిషన్, ఇందు పాల్గొన్నారు.

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో ఉపయోగకరమని ఏసీటీఓ నాయక్ అన్నారు. జీఎస్టీపై బుధవారం స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులకు అవగహన కల్పించారు. నాయక్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి శేషాద్రిలు మాట్లాడుతూ జీఎస్టీ ధరలు తగ్గించడంతో వ్యవసాయ పనిముట్లు, పరికరాల ధరలు తగ్గాయన్నారు.

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు జీఎస్టీ తగ్గింపు గురించి వివరించారు. రైతులు ఉపయోగించే సూక్ష్మ పోషకాలు, జీవ మరియు వేప సంబంధిత పురుగుమందులు, ట్రాక్టర్లు, యంత్ర పరికరాలపై 12, 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఏఈఓ సతీష్, ఎంఐఏఓ సౌమర్య,వ్యవసాయసహాయకులువెంకటేష్, పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 42 వార్డుల పరిధిలోని పింఛన్‌దారులకు బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు. సాయంత్రం 5 గంటల వరకు 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. అలాగే ఆదోని నియోజకవర్గంలో స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, నాయకులు, వార్డుల కౌన్సిలర్లు చేతులమీదుగా పంపిణీ చేశారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర వీడి అధిక వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలకు మండలంలో పత్తి, మిరప, ఉల్లితో పాటు వివిధ పంటలు నీట మునిగి, కుళ్లిపోయి లేదా వివిధ రకాలుగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రైతులకు ఎకరానికి రూ. 50వేల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చంద్ర, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ నాయకులు ఈరన్న, సురేష్, గోపాలు పాల్గొన్నారు.

విద్య, వైద్యం దూరం చేయడమే కూటమి లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం దూరం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, కౌన్సిలర్ ఫయాజుద్దీన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి కార్యదర్శి వెంకప్ప, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్‌తో పాటు వక్తలు ముక్తకంఠంతో ఆరోపించారు. బుధవారం స్థానిక కళాశాలలో ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకగా రౌండు టెబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు పేద మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో మెడికల్ కళాశాలలను నిర్మించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను నిలిపి వేయడమే కాకుండా, పీపీపీ పేరుతో వాటిని పెత్తందారులకు కట్టబెట్టేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి కళాశాల వెళితే పేద ప్రజలకు వైద్యం అందే పరిస్థితి ఉండదన్నారు. అధికారంలోకి వస్తే సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతిని వంద రోజుల్లో రద్దు చేస్తామని చెప్పిన నాయకులు ఆ విషయంపై నోరు మెదపడం లేదన్నారు. ఆదోనిలో దాదాపు 80 శాతం పూర్తి అయిన మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి, కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆశలను నీరు కార్చుతున్న ప్రభుత్వం

పేద, మధ్య తరగతి ప్రజల ఆశలను కూటమి ప్రభుత్వం నీరుగార్చుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫయాజుద్దీన్ ఆరోపించారు. పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్) అంటే ప్రజలతో మమేకం అంటూ పేరును వక్ర భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఒక్కసారి పెత్తందారుల చేతిలోకి వెళితే పేద ప్రజలకు ఏవిధంగా వైద్య సేవలు అందుతాయని ప్రశ్నించారు.

పింఛన్ కోసం పడిగాపులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం అందించే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్ కోసం లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల దగ్గర పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయాల సిబ్బంది తమ సమస్యల పరిష్కారించే వరకు పింఛన్లను సచివాలయాల్లోనే పంచుతామని చెప్పినట్లు పట్టణంలో వార్త చక్కర్లు కొట్టింది. విషయం తెలుసుకొన్న పింఛన్ దారులు బుధవారం ఉదయం 7 గంటలకే సచివాలయాల వద్దకు వచ్చి కూర్చున్నారు. అయా సచివాలయాలకు చెందిన సిబ్బంది తీరా 9.30 గంటలకు, 10 గంటలకు వచ్చి పింఛన్లను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తెల్లవారక ముందే ఇంటి తలుపు తట్టి నగదు అందించేవారని గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ మూడునాళ్ల ముచ్చటగా మారిందని, ఇప్పుడు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నడవలేని ముసలి, ముతక, వికలాంగులు సచివాలయాల దగ్గరకు వెళ్లి ఎప్పుడు తెచ్చుకోవాలని, పింఛన్ల కోసం ఇలా కార్యాలయాలు చుట్టు తిరగడం ఇబ్బందిగా ఉందని, ఇళ్ల దగ్గర పంపిణీ చేస్తే బాగుందని పలువురు కోరుతున్నారు.

ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలి

గోనెగండ్ల : అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగన్న, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మద్దిలేటి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు, గుల్లమొరుసు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఐ నాయకులు పరిశీలించారు వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఉల్లి, మిరప, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, కంది, ఆముదాము తదితర పంటలు వర్షాలకు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, హనుమంతు, లింగన్న, బొబ్బిలి, వెంకన్న, చంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం రూరల్ : ప్రముఖ్య ఆధ్యాత్మిక కేంద్రం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిమళ విద్యా నికేతన్‌కు బాగల్‌కోట్‌కు చెందిన నింగప్ప విద్యాదానానికి రూ.1,00,000 విరరాళం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆయనకు శేష వస్త్రం, రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందించి ఆశీర్వదించారు. శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మారెమ్మ దేవి విగ్రహ ఊరేగింపు

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన కందనాతి మారెమ్మ దేవి నూతన వెండి విగ్రహాలను భక్తుల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. బుధవారం ట్రాక్టర్ పై కొలువుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయం చెంతకు చేరుకున్నారు. అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

విరుపాపురంలో ర్యాలీ

ఆదోని రూరల్: మండలంలోని విరుపాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు రీ సర్వే గ్రామసభ కార్యక్రమంపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ అరుణమ్మ, గ్రామ సర్పంచ్ ప్రహ్లాద యాదవ్, ఎంపీటీసీ శివకుమార్, రీ సర్వే డ్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు. రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్, చిన్న ఈరన్న, రమేష్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

గొర్రెలకు ఉచిత బీమా కల్పించాలి

కోసిగి: గొర్రెల పెంపకమే జీవనాధారంగా జీవిస్తున్న కురువ కులస్తులకు, గొర్రెలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, గొర్రెల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ రాముడులు కోరారు. బుధవారం కోసిగిలో వారు విలేకరులతో మాట్లాడుతూ అనునిత్యం గొర్రెల దొంగతనాలు, ప్రకృతి వైపరిత్యాల కారణంగా మృతి చెందడం, రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోవడంతో గొర్రెల కాపరులకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు.